ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
బుధవారం 24 ఏప్రిల్ 2024



ఊర్లేవీ జగన్..?



మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి పేదోడి ఇంటి కలను నెరవేర్చేందుకు రూ.5 లక్షల విలువ చేసే ఇంటిని నిర్మించి ఇస్తాం. ఇదీ సీఎం జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ. ఎవరికైనా సొంతిల్లు ఒక కల. అది నెరవేర్చేందుకు అహర్నిశలు కష్టపడతారు. ఇంటి నిర్మాణం మొదలైనప్పటి నుంచి పూర్తయ్యేంత వరకు వారి ధ్యాస అంతా ఇంటిపైనే ఉంటుంది. ఇక సీఎం జగన్ ప్రతిపక్ష నేత హోదాలో ఏకంగా ఇంటిని నిర్మించేసి తాళాన్ని ఇస్తామని చెప్పుకొచ్చారు. అంటే నిర్మాణం పూర్తయిన ఇంట్లోకి నేరుగా గృహ ప్రవేశం చేయడమే.. సీఎం అయ్యాక.. పేదలకు ఇల్లు కాదు.. ఊర్లే నిర్మిస్తున్నామని ప్రకటించారు. అన్నింటికీ జగనన్న లేఅవుట్ అని నామకరణం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేవలం రూ.1.80లక్షలు మాత్రమే ఇవ్వడం.. మౌలిక వసతులు లేకపోవడంతో.. జిల్లాలో కేటాయించిన ఇళ్లలో 30శాతం కూడా లక్ష్యం చేరుకోలేదు. ఇళ్ల నిర్మాణంపై జగన్ ఇచ్చిన హామీ అమలు సొంత జిల్లాలోనే అధ్వాన్నంగా ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు అసంతృప్తితో ఉన్నారు.



- ప్రతి పేదోడికి ఐదు లక్షలతో ఇంటి నిర్మాణం
- తాళాలు చేతికిస్తాం
- ప్రతిపక్షనేతగా జగన్ ఇచ్చిన హామీ..
- ఇల్లు కాదు.. ఊర్లు కడుతున్నాం..
- అధికారం చేపట్టాక.. గొప్పగా ప్రకటనలు
- ఊరుబయట ఎక్కడో విసిరేసినట్లుగా స్థలాలు
- అక్కడ వసతులు నిల్
- ఊర్లు కాదు కదా.. గోడలు కూడా కట్టుకోలేక పేదల అవస్థలు

కడపలో పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సీఎం అయితే సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో పేద, మధ్యతరగతి కుటుంబాలన్నీ జగన్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారు. ఇచ్చిన హామీని అమలు చేస్తారని పేద, మధ్య తరగతుల వారు సంతోషించారు. అయితే చావు కబురు చల్లగా అన్నట్లు జగన్ నవరత్నాల పేరిట ఎక్కడో శివారు ప్రాంతాల్లో ఊరికి దూరంగా విసిరేసినట్లుగా, కొండలు గుట్టల వద్ద సెంటు స్థలం ఇచ్చేసి అక్కడ కట్టుకోండంటూ చెప్పుకొచ్చారు. పోనీ జగన్ ప్రతిపక్షనేతగా హామీ ఇచ్చిన మేరకు రూ.5లక్షలు ఇచ్చారా అంటే లేదు.. ఇంటి నిర్మాణానికి తగ్గట్లుగా వ్యయాన్ని పెంచారా అంటే లేదు.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షలు కేటాయించింది. అయితే దానిని జగన్ రూ.1.80 లక్షలకు కుదించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు.

ఇంటి నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. సిమెంటు, ఇనుము, ఇటుకలు, ఇసుక, బేల్దారుల కూలీ ఇలా ఒకటేంటి నిర్మాణానికి అవసరమైన సమస్తం ధరలు పెరిగాయి. జగన్ చెప్పిన కొలతల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కనీసం ఎంత తక్కువగా వేసినా కూడా రూ.7.50 నుంచి 9 లక్షల మధ్య అవుతుంది. అయితే ఇంటి నిర్మాణానికి క్షేత్రస్థాయిలో వ్యయం అయ్యే ఖర్చులు పట్టించుకోకుండా సుమారు రూ.9 లక్షలు అయితే కేవలం లక్షా ఎనభైవేలు మాత్రమే ఇచ్చి ఆ డబ్బుతోనే మేం చెప్పిన కొలతల మేరకు ఇల్లు కట్టుకుని పండుగ చేసుకోండి అనే విధంగా ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోక ఇళ్ల నిర్మాణాలు సాగలడం లేదు. మేం ఇల్లు కట్టడం లేదు ఊర్లు కడుతున్నామంటూ జగన్ ఎంతో గొప్పగా చెప్పుకొచ్చారు. అయితే సొంత జిల్లాలోనే ఇళ్ల కట్టడం లేదని తేలిపోయింది. ఎందుకంటే ప్రభుత్వం ఇచ్చే డబ్బుకు ఇంటి నిర్మాణం పూర్తికావడం లేదు. దానికి తగ్గట్లు ఎక్కడో కొండలు గుట్టల్లో ఇచ్చేశారు. దాచుకున్న సొమ్మతో, అప్పుచేసి కట్టుకుందామన్నా ఊరికి దూరంగా విసిరేట్లుగా ఉంది. కూలీ పనులకు వెళ్లాలన్నా చాలా దూరం. పోనీ అక్కడ ఉందామనుకున్నా కరెంటు లేదు, రోడ్లు లేవు. నీరు ఉండదు. ఇలాంటి చోట మాకు ఇళ్లా అంటూ లబ్ధిదారులు ముఖం చాటేశారు. అంతే.. జిల్లాలో ఇళ్ల నిర్మాణం నత్తేనయంగా సాగుతోంది.

అసంపూర్తి నిర్మాణాలు

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో 1,08,254 ఇళ్లను కేటాయించారు. రిజిస్ట్రేషన్లు చేసుకునే సమయానికి ఇంటి నిర్మాణానికి 97,190 మంది సుముఖత వ్యక్తం చేశారు. వీళ్లందరికీ ఊరికి దూరంగా ఉన్న జగన్ లేఅవుట్‌లో స్థలాలు ఇచ్చేశారు. ఉన్న చోటుకు, ఇచ్చిన కాడికి పొంతనలేదు. తొలుత ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తుందని చెప్పుకొచ్చారు. దీంతో చాలామంది పేదలు ప్రభుత్వమే నిర్మిస్తుంది కదా అనుకున్నారు. అయితే ప్రభుత్వం ఆప్షన్లు పెట్టి కోత విధించింది. ఇళ్లు మీరే కట్టుకుంటారా, స్థలాలు రద్దు చేయాలా, వేరేవారికి ఇస్తామని మెడపై కత్తి పెట్టి వత్తిడి చేశారు. దీంతో తప్పనిసరై ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టారు. రెండు నెలల క్రితం ఇళ్లనిర్మాణం చేపట్టినా కనీసం 40 శాతం కూడా పూర్తి కాలేదు. లేఅవుట్లలో కనీసం రోడ్లు, తాగేందుకు నీరు, డ్రైనేజీ, సరైన కరెంటు సౌకర్యం లేదు. ఎక్కడో ఊరికి దూరంగా ఉండడంతో అక్కడకు జనాలు భయపడి పోలేదు. వెరసి జగన్ లేఅవుట్లలో అంతా అసంపూర్తి నిర్మాణాలే కనిపిస్తున్నాయి.




పులివెందులలో ఇదీ తీరు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్నది సీఎం జగన్ పులివెందులలోని జగనన్న లేఅవుట్. ఇక్కడ 7079 ఇళ్లను కేటాయించారు. పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. లే అవుట్‌లో కనీస వసతులు రోడ్లు, డ్రైనేజీ, కరెంటు నీళ్లు లేవు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి ఇంతవరకు 205 ఇళ్లు గునాదులే తీయలేదు. 2160 ఇళ్లు పునాది దశలో ఉన్నాయి. 2805 ఇళ్లు శ్లాబు లెవల్‌లో ఉన్నాయి. 2104 ఇళ్లు పూర్తయ్యాయి. 1385 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయి. ఇక్కడ వివిధ దశల్లో ఉండడంతో ఇళ్లు పూర్తయినా కూడా లబ్ధిదారులు రాని పరిస్థితి నెలకొంది.

జిల్లా కేంద్రంలోనూ..

ఇది కడప నగర శివారులోని కొండపై ఉన్న వైఎస్ఆర్ లేఅవుట్‌లో పలువురు పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చారు. సొంతిల్లు లేక అద్దె ఇంట్లో మగ్గుతున్నాం. సొంతింటి కల నెరవేరుతుందని ఆశపడ్డారు. అయితే చివరికి ఎక్కడో కొండల్లో స్థలాలు ఇచ్చారు. గవర్నమెంటు ఇచ్చింది కదా, నీళ్లు, రోడ్లు, కరెంటు ఇస్తే ఏదో అక్కడ నుంచి వచ్చి టౌన్‌లో పనిచేసుకోవచ్చని సంబరపడ్డారు. ఇంటిస్థలాలు ఇచ్చారు కానీ వసతులు మాత్రం మరిచారు. ఈ లే అవుట్‌కు వెళితే పొరపాటుగా ఏమరుపాటుగా ఉన్నా లోయలోకి పడిపోవాల్సిందే.



ఇదీ బద్వేలులో ఇళ్ల నిర్మాణం తీరు

పై ఫొటోలో బద్వేలు మున్సిపాలిటీలోని చెన్నంపల్లె, సిద్దమ్మపేరంటాలు లే అవుట్. సిద్దమ్మ పేరంటాలు నెల్లూరు రోడ్డులోని జాతీయ రహదారిపక్కన కొండపై ఉంది. ఇక్కడ 1208 మంది పేదలకు ఇళ్లు కేటాయించారు. అయితే పేదలపై వత్తిడి తేవడంతో 308 ఇళ్లు పూర్తయ్యాయి. బేస్‌మట్టం లెవల్‌లో 653, పునాదులు 93, గోడలు లెవల్‌లో 183 ఉన్నాయి. సరే పూర్తయిన ఇళ్లల్లోకి వెళదామంటే.. ఇక్కడ వసతులు లేవు. బద్వేలు-నెల్లూరు జాతీయ రహదారి పక్కనే తెలుగు గంగ కాల్వ ఉంది. ఆ కాల్వపై బ్రిడ్జి వేస్తే నేరుగా కాలనీలోకి వెళ్లవచ్చు. ఇంతవరకు అక్కడ బ్రిడ్జి నిర్మించలేదు. రోడ్డుపై నుంచి కాలనీకి వెళ్లాలంటే కనీసం ఒకటిన్నర కి.మీ మేర తిరిగిరావాల్సి ఉంది. పోనీ అక్కడ నీరు కానీ రోడ్లు కానీ లేవు. అదంతా ఎడారి ప్రాంతంగా ఉంది.

బద్వేలు మున్సిపాలిటీలో చెన్నంపల్లె లేఅవుట్‌లో మొత్తం 766 ఇళ్లు. పునాది లెవల్ 41, బేస్‌మట్టం 286, గోడలు లెవల్ 229, పూర్తయినవి 210 మాత్రమే. మంజూరైన ఇళ్లలో వసతులు లేకపోవడం, ఇక్కడ నత్తనడకన ఇళ్ల నిర్మాణానికి కారణమవుతోంది. ఇళ్లు కాదు ఊర్లు నిర్మిస్తున్నామని జగన్ అండ్ కో ఎన్ని గొప్పలు చెబుతున్నప్పటికీ గ్రౌండ్ లెవల్‌లో అంత సీన్ లేదని తేలిపోయింది. జగన్ ఇదేనా మీరు చెప్పిన ఊర్లు అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



వైభవంగా కోదండరాముని రథోత్సవం





- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





భారీ జనసందోహం మధ్య కోదండరాముని రథోత్సవం

రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 23: ఏకశిలా నగిరి ఒంటిమిట్ట కోదండరాముని రథోత్సవం ఒంటిమిట్టలో కన్నులపండువగా సాగింది. మంగళవారం ఉదయం 10.15 గంటలకు ప్రారం భమైన రథత్సవం సాయంత్రం 5గంటల వరకు సాగింది. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని రథం లాగడానికి పోటీ పడ్డారు. రథోత్సవం సందర్భంగా శ్రీరామ నామస్మ రణతో ఆప్రాంతమంతా మార్మోగింది. రథంపై సీతారాముల ఉత్సవమూర్తులను చూసి భక్తులు పులకించిపోయారు. రథోత్సవం ఆద్యంతం భజంత్రీలు, చెక్కభజనలు మోగిస్తూ ముందు కుసాగారు. భక్తులు స్వామి వారికి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. అంతకుముందు రథోత్సవ కార్యక్ర మానికి సంప్రదాయ రీతిలో టీటీడీ వేదపం డితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇంజనీరింగ్ అధికారులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు సీఎం జగన్ పులివెందులకు రాక

- మధ్యాహ్నం నామినేషన్ దాఖలు

పులివెందుల, ఏప్రిల్ 23: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం పులివెందులకు రానున్నారు. ఉదయం 11 గంటలకు తాడేపల్లె నుంచి పులివెందులకు చేరుకుంటారు. సీఎస్ఐ చర్చి గ్రౌండ్ ఆవరణలో సభకు హాజరుకానున్నారు. అనంతరం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పులివెందుల అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం ఆయన బయలుదేరి తాడేపల్లెకు వెళ్లనున్నారు. ఇప్పటికే జగన్ తరఫున ఒక సెట్టు నామినేషన్‌ను ఆయన బాబాయి వైఎస్ మనోహర్‌రెడ్డి సోమవారం దాఖలు చేశారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



పులివెందుల టౌన్, ఏప్రిల్ 23: పులివెందుల నియోజకవర్గ కేంద్రంలో 25వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నామినేషన్ వేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్, ఎస్పీ అంబకపల్లె రోడ్డులోని మినీ సెక్రటేరియట్‌లో ఉన్న ఆర్‌ఓ కేంద్రంలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈనెల 25వ తేదీన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం సీఎస్ఐ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అక్కడ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ నుంచి వైఎస్ జగన్ నివాసం వద్ద, బాకరాపురం హెలిప్యాడ్ పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఐదోరోజు 35 నామినేషన్లు

- కడప పార్లమెంట్‌కు 6, అసెంబ్లీ స్థానాలకు 29

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఐదోరోజు మంగళవారం 35 నామినేషన్లు దాఖలయ్యాయి. కడప పార్లమెంట్ స్థానానికి 6 నామినేషన్లు, 7 అసెంబ్లీల నియోజకవర్గాలకు 29 నామినేషన్ల పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఎంపీ స్థానానికి వైసీపీ నుంచి వైఎస్ అవినాశ్‌రెడ్డి తరఫున ఒకసెట్టు నామినేషన్ వేశారు. పందిటి గుర్రప్ప (బహుజన సమాజ్ వాది పార్టీ), రాచినేని వేణుగోపాల్ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ), కుడుముల వెంకటసుబ్బారెడ్డి (స్వతంత్ర), చింతల యేసయ్య (భరోసా పార్టీ), అంకిరెడ్డి సురేశ్‌కుమార్ రెడ్డి (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), హనుమంతరెడ్డి (జన సహాయక సాక్షి) నామినేషన్లను దాఖలు చేశారు. బద్వేలు అసెంబ్లీ స్థానానికి వైసీపీ నుంచి డాక్టర్ సుధ, పులివెందులకు టీడీపీ నుంచి బీటెక్ రవి తరఫున ఆయన సోదరుడు మారెడ్డి జోగిరెడ్డి, కమలాపురానికి టీడీపీ నుంచి పుత్తా నరసింహారెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి నామినేషన్లు వేశారు. వీరితో పాటు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పలు పార్టీల తరఫున, స్వతంత్రులు మొత్తం 29 మంది నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.



కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ నుంచి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న పుత్తా నరసింహారెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



నజీరుద్దీన్‌ను మద్దతు కోరుతున్న సునీత, అఫ్జల్‌ఖాన్

కడపలో పలువురి మద్దతు కోరిన డాక్టర్ సునీత

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 23: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి కడప ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆమెకు మద్దతు కోరుతూ వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత మంగళవారం కడపలో పలువురు నేతలను కలిశారు.స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డికి అత్యంత సన్నిహితులు, అభిమానులు, మతపెద్దలను కలిశారు. వైఎస్‌కు సన్నిహితుడైన నజీరుద్దీన్‌ను కడప అసెంబ్లీ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్‌తో కలసి మద్దతు కోరారు. కాంగ్రెస్‌ను పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

13న ప్రభుత్వ సెలవు

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 23: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మే 13వతేదీ సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రైవేటు సంస్థలకు, దుకాణాలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని జిల్లా ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 18 సంవత్సరాలు నిండి ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

కడప(మారుతీనగర్), ఏప్రిల్ 23: ఈ నెల 27న జరుగనున్న పాలీసెట్ -2024 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల జిల్లా సమన్వయకర్త సీహెచ్ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ మేరకు కడప నగరంలో 9 కేంద్రాలు, ప్రొద్దుటూరులో 7 కేంద్రాలతో కలిపి మొత్తంగా 16 కేంద్రాల్లో పరీక్ష జరుగనుందన్నారు. ఇందులో సుమారు 7,838 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. కాగా హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు హాజరు కావాల్సి వుంటుందన్నారు. హాల్ టిక్కెట్టుతో పాటుగా 2బి పెన్సిల్, బాల్‌పాయింట్ పెన్, ఎరైజర్, షార్ప్‌నర్ మాత్రమే వారి వెంట తీసుకురావాల్సి వుంటుందన్నారు. ప్రధానంగా సెల్‌ఫోన్, కాలిక్యులేటర్, తదితర ఇతర ఎలక్ట్రానిక్ సంబంధిత పరికరాలు అనుమతించబడదన్నారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు, వడదెబ్బ తగలకుండా అవసరమైన మందులు, ఆయా శాఖల అధికారుల సహాయంతో బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశారన్నారు. ఏదేమైనా ఉదయం 11 గంటల తర్వాత విద్యార్థులను లోనికి అనుమతించేది లేదన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలి
- ఆకస్మిక తనిఖీల్లో వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్


సిబ్బందితో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. మంగళవారం వైవీయూలో పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్, సీఎల్ స్టాకు రిజిస్టరు పరిశీలించారు. వాటిని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉద్యోగులందరూ కార్యాలయంలో సమయపాలన పాటించాలని పనివేళల్లో సీట్లో కనిపించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యాలయానికి సక్రమంగా రాని ఉద్యోగులకు జీతాలు నిలుపుతామని హెచ్చరించారు. అలాగే స్వీకరించిన అన్ని ఫైళ్లను అదే రోజు ప్రాసెస్ చేసి క్లియర్ చేసేలా చూడాలన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

19న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 23: పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరచిన పద్మశాలీయ విద్యార్థులకు మే 19వ తేదీన ప్రతిభ పురస్కారాలను అందజేస్తామని పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు తెలిపారు. మంగళవారం పద్మశాలీయ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో చదువుకుని ఇంటర్మీడియట్‌లో అన్ని గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రూపులవారీగా ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు అందజేస్తామన్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, ప్రభుత్వ పాఠశాలలో చదివి 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులను అందజేస్తామన్నారు. ఎంసెట్, నీట్, ఇంజనీరింగ్, ఐఐటీ, జేఈఈలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులను బహూకరిస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు మే 10వ తేదీలోపు తమ దరఖాస్తులను పద్మశాలీయ కల్యాణ మండపంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9440074989లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నా చంద్రబాబు, ఉపాధ్యక్షులు నందం లక్ష్మణకుమార్, జలదుర్గం మునిస్వామి, కార్యదర్శి ఆనంద్, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్యాండేజీలతో వినూత్న ప్రచారం


బ్యాండేజీలతో ప్రచారం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో వైష్ణవి

పీలేరు, ఏప్రిల్ 23: కళ్లు, నుదిటిపై బ్యాండేజీలతో ముఖ్యమంత్రి జగన్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌లను అనుకరిస్తూ పీలేరులోని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మంగళవారం వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ముబారక్, అబ్దుల్లా, హరీష్, సురేశ్, రెడ్డిముని, నాయుడు, మల్లి తమ కళ్లు, నుదుటిపై బ్యాండేజీలు కట్టుకుని స్థానిక సైనిక్‌నగర్, కావలిపల్లె ప్రాంతాల్లో ప్రచారం చేశారు. సానుభూతి కోసం జగన్, ఆయన నాయకులు గులకరాయి డ్రామా ఆడుతున్నారని, వాటిని నమ్మకుండా ఎన్నికల్లో కూటమి అభ్యర్థులైన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కుమార్తె వైష్ణవిరెడ్డి కాసేపు వారితో కలిసి ప్రచారం నిర్వహించారు.

ఎడ్‌సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చైర్మన్ ప్రొఫెసరు ఆంజనేయప్రసాద్, కన్వీనరు సురేంద్రనాథరెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ ద్వారా 2024-25 విద్యాసంవత్సరంలో యానిమేషన్ అప్లైడ్‌ఆర్ట్స్, పెయింటింగ్, కల్చర్ ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్‌లో ప్రవేశం కోరే విద్యార్థులు హయ్యర్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 22 వరకు గడువు ఉందన్నారు. వివరాలకు ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్, యూనివర్శిటీ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

బీజేపీ నాయకులపై కేసు నమోదు

ముద్దనూరు ఏప్రిల్ 23: మండల పరిధి బొందలకుంట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులపై మంగళవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. గత ఆదివారం బొందలకుంట గ్రామానికి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి రాగా ముట్టే రామచంద్రుడు, గాలం సుబ్బయ్య, చల్లా ఖాదరయ్య టపాసులు పేల్చి ఎన్నికల నియమావళి ఉల్లించారని, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్-3 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేజీబీవీ విద్యార్థిని రూష్మికకు 583 మార్కులు


రూష్మిక

సింహాద్రిపురం, ఏప్రిల్ 23: మండలంలోని నిడివెలగల వద్ద గల కేజీబీవీ పాఠశాల విద్యార్థి సి.రూష్మిక పదవ తరగతి ఫలితాల్లో 583 మార్కులు సాధించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లోని కేజీబీవీల్లో ఇవే అత్యధిక మార్కులని కేజీబీవీ ప్రిన్సిపాల్ గురుదేవి తెలిపారు. అలాగే పాఠశాల్లో 550 పైగా మార్కులు సాదించిన వారు 8 మంది, 500పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు 18 మంది, 450కి పైగా మార్కులు పైగా సాధించిన వారు 7 మందితో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

నత్తకే నడకలు..!



- పూర్తికాని ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులు
- పార్నపల్లె నుంచి ఒక్క గ్రామానికి అందని వైనం
- పనులు సాగుతున్నాయ్.. అంతే..!
- నెల రోజుల్లో ముగియనున్న గడువు
- ఇదీ పులివెందుల వాటర్‌గ్రిడ్ పనుల తీరు

కడప, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అది సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా వాటర్ గ్రిడ్ పనులు ప్రారంభించారు. ఆ పనులు చూస్తే నత్తకే నడకలు నేర్పుతున్నట్లు సాగుతున్నాయి. మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాని దుస్థితి నెలకొంది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పనులు ఎన్నడు పూర్తవుతాయో అధికారులకే ప్రశ్నగా మిగిలింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...

పులివెందుల నియోజకవర్గంలో ఏడు మండలాల్లోని ప్రతి గ్రామానికి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజరాయర్ నుంచి రూ.480 కోట్లతో 299 గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించి 299 గ్రామాలకు తాగునీరు అందించే వాటర్ గ్రిడ్‌లో 194 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు 175 పూర్తైనట్లు అధికారిక లెక్క. ఇప్పటి వరకు రూ.209 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. దాదాపు 200 కిలోమీటర్ల మేర వివిధ సైజుల్లో పైప్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అందులో 50 శాతం మేర పనులు పూర్తైనట్లు సమాచారం. ఈ పనులను కేంద్ర ప్రభుత్వ నిధులతో జల్‌జీవన్ మిషన్ కింద పనులు చేపట్టారు. ప్రతి రోజు 65 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) శుద్ధినీటిని అందించాల్సి ఉంది. ఈ పనులు 21.5.2021వ తేదీన పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించే సమయంలో మూడేళ్లలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ 20.05.2024 నాటికి పూర్తికానుంది. అంటే ఒక నెలలో గడువు పూర్తికానుంది. అయితే పనులు మాత్రం పూర్తికాలేదు. మరో ఏడాదైనా పనులు పూర్తై గ్రామాలకు తాగునీరు అందుతుందని కనిపించలేదు. వాటర్ గ్రిడ్ పనులు పైప్‌లైన్ ఏర్పాటు కోసం పనుల్లో పైపులు పొలాల గట్ల వద్ద ఉంచారు. వాటిని పూడ్చడంలో ఆలస్యమవుతోంది. కాగా పార్నపల్లె వద్ద శుద్ధినీటి కేంద్రం పనులు పూర్తయ్యాయి. మొదట లింగాల, సింహాద్రిపురం, పులివెందులకు నీటిని అందించాలని అనుకున్నప్పటికి ఆ పనులు అసంపూర్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ పనులను ఎంతో నాణ్యతగా 30 ఏళ్ల పాటు ఎలాంటి మరమ్మతులు లేకుండా సాగాల్సి ఉంది. కానీ పనులు మొదలుపెట్టి మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తవకపోవడంపై ప్రభుత్వంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తయ్యే నాటికి ఏర్పాటు చేసిన పైపులు, ట్యాంకులు శిథిలమవుతాయేమోనని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే పనుల తీరు ఇలా ఉంటే మిగిలిన చోట్ల పనులు ఎలా సాగుతున్నాయో ఇట్టే అర్థమవుతోంది. ఏదేమైనా వాటర్ గ్రిడ్ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయన్నది నగ్నసత్యం.


పులివెందుల ప్రాంతంలో పూర్తికాని వాటర్ గ్రిడ్ పనులకు సంబంధించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

- 23 నుంచి ఫీజు చెల్లింపు
- 24 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 23: ఏపీ డీఈఈ సెట్ 2024కు సంబంధించి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసిందని, డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండేళ్ల ఉపాధ్యాయ కోర్సులో చేరడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 23వ తేదీ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి 24 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి కడప జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆమె వెల్లడించారు. డీఈఈ రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కంప్యూటర్ బేస్డ్) ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని వివరించారు. 2024 సెప్టెంబరు 1వ తేదీ నాటికి అభ్యర్థులకు 17 ఏళ్లు నిండి ఉండాలన్నారు. దీనికి గరిష్ఠ వయోపరిమితి ఉండదని తెలిపారు. దరఖాస్తు రుసుం రూ.750లు చెల్లించాలన్నారు. మే నెల 8వ తేదీ ఫీజు చెల్లింపునకు, 9న దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగుస్తుందన్నారు. మే 21వ తేదీ ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు తమ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. మే 24వ తేదీ పరీక్ష, మే 30 తేదీ ఫలితాలు వెల్లడి అవుతాయన్నారు. అలాగే జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు అభ్యర్థులు కళాశాలలు ఎంచుకోవడానికి వెబ్ ఆప్షన్ పెట్టుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీ అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ప్రభుత్వం డీఎడ్ కళాశాలలను కేటాయిస్తుందని, జూన్ 12 నుంచి 15 వరకు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందన్నారు. జూన్ 20వ తేదీ కళాశాలల్లో తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందని ఆమె ప్రకటనలో తెలిపారు.

వేడుకగా ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణం


గంగా, రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 23: రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంను కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవ రోజు స్వామివారి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. సైకతలింగానికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి చండీమాత, శ్రీచక్రంకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, శాంతి హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగరాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజారెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ఘనంగా గంధం మహోత్సవం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 23: పట్టణంలో వెలసిన దర్గా ఏ-గఫారియా జహిరాయ దర్గా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఉరుసు మహోత్సవంలో భాగంగా రెండో రోజు గంధం మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పడమటవీధి నుంచి మేళతాళాలతో, చిన్నారుల కేరింతలతో, ఫక్కీరు విన్యాసాలతో బాణసంచా పేల్చుతూ తీసుకువచ్చారు. ఊరేగింపులో ఫక్కీర్లు చేసే విన్యాసాలు చూపరులకు ఒళ్లు గగుర్పొడిచినట్లయింది. ప్రస్తుత పీఠాధిపతి ముతవల్లి గఫార్‌షా ఖాద్రి ఆయన సోదరులు గంధం మహోత్సవంలో పాల్గొన్నారు.

అలరించనున్న ఖవ్వాలి: గంధం ఉరుసు మహోత్సవ సందర్భంగా రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ నిర్వహించనున్నారు. ఈ ఏడాది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రాజస్థాన్‌కు చెందిన సలీంసాబిరి, ముంబైకి చెందిన ఖలీమ్ నయీం హస్మిల మధ్య కవాలీ పోటీ జరగనుంది.

24న బండలాగుడు పోటీలు: ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దర్గా ఆవరణంలో పాల దంతాలు గల వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు రూ.50 వేల నుంచి బహుమతులు అందించనున్నారు.


ఉరుసు ఉత్సవంలో విద్యుత్ కాంతులు

ఎన్నికల ప్రచారంలో వెటర్నరీ అసిస్టెంట్, రేషన్ డీలర్లు


ప్రచారంలో పాల్గొన్న సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్, రేషన్‌డీలర్

వీరబల్లి, ఏప్రిల్ 23: వైసీపీ రాజంపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మిథున్‌రెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డిల ఎన్నికల ప్రచారంలో వెటర్నరీ అసిస్టెంట్, రేషన్ డీలరు పాల్గొన్నారు. మంగళ వారం మండల కేంద్రంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో వంగి మళ్ల గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్, పెద్దమాదిగపల్లె రేషన్‌షాపు డీలర్ మలికార్జునలు పాల్గొని వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సన్మానించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు.

వైసీపీ కార్యకర్తపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 23: వైసీపీకి చెందిన వెంకటరామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సోమవారం నామినేషన్ వేశారు. ఈ నేపథ్యంలో స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలకు చెందిన చౌడమ్మ ఆలయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ బాణసంచా కాల్చారు. ఈ ఘటనపై ఫ్లయింగ్ స్క్వాడ్-1 అధికారి శ్రీనివాసులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వెంకటరామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కన్నులపండువగా సీతారాముల కల్యాణం


కల్యాణోత్సవం జరిపిస్తున్న వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు

పీలేరు, ఏప్రిల్ 23: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పీలేరు మండలం కాకులారంపల్లె ఇందిరమ్మ కాలనీలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దళవాయి సురేశ్‌కుమార్‌రెడ్డి అలియాస్ కంచి సూరి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లను కాలనీ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కాలనీ ప్రజలు, భక్తులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేంద్ర, నివాస్‌రెడ్డి, కిరణ్, భరద్వాజ్, చెన్నారెడ్డికాలనీ హరి, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీమోహన్, సూరి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా పట్టాభిరాముల రథోత్సవం


కందుకూరు పురవీధుల్లో ఊరేగుతున్న పట్టాభిరాముల వారు

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 23: మండలంలోని కందుకూరులో వెలసిన పట్టాభిరాముల శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం పట్టాభిరాముల వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. శ్రీ సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల ఉత్సవ విగ్రహాలను రథంలో అధిష్టించి పురవీధుల్లో విహరించారు. స్వామివారి రథం ముందు భజన బృందాలు, చెక్కభజనలతోటి, కోలాటాలు చేస్తుండగా పురవీధుల్లో మంగళవాయిద్యాలతో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నిరాజనాలు అందించారు. కందుకూరు గ్రామం భక్తులతో కిటకిటలాడింది. పట్టాభిరాముల రథోత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని తిలకించారు.

నూతన కమిటీ నియామకం


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 23: మండల కేంద్రమైన పీటీ ఎంలో వెలసిన ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నూతన కమిటీని మంగళ వారం ఆర్యవైశ్యులు ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా పీటీఎంకు చెందిన దొంతి రాజశేఖర్‌ను, కార్యదర్శిగా నాగరాజు, గడ్డం సతీష్‌ను ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం అభివృద్ధికి, సంఘం పటిష్టం కొరకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గత కమిటీలో ఉన్న అభ్యర్థుల నుంచి దేవస్థానానికి చెందిన రికార్డులను నూతన కమిటీకి అప్పగించారు. వచ్చే నెల మే 18న కన్యకా పరమేశ్వరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నూతన కమిటీ ఆమోదించినట్లు పేర్కొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన ?

మైదుకూరు, ఏప్రిల్ 23: పట్టణంలోని కంప్యూటర్ నేర్చుకునేందుకు వచ్చిన బాలిక పట్ల ఆ సెంటరు నిర్వాహకుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బాలికకు కంప్యూటర్ నేర్పించే క్రమంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు మంగళవారం నిర్వాహకునిపై పోలీసులకు సమాచారం అందించారు. నిర్వాహకుని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.



పెన్నానదిలో ఇసుకను నింపుతున్న ఎక్స్‌కవేటర్ (ఫైల్‌ఫొటో)

అందినంత తవ్వుకో... వచ్చినంత దాచుకో....

- వైసీపీ నేతలకు కాసులు కురిపించిన ఇసుక
- ఎడారిగా మారి ఇసుక గుంతలతో పెన్నానది
- ఏడాది కిందటే నిరసన తెలిపిన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 23: జమ్మలమడుగు నియోజకవర్గంలో పెన్నానది పరిసర ప్రాంతాలు వైసీపీ నేతలకు కల్పతరువుగా మారిందని చెప్పవచ్చు. ఐదేళ్లగా నియోజకవర్గంలోని అంబవరం, కన్నెలూరు, పొన్నతోట, గూడెం చెరువు, దానవులపాడు, పి.సుగుమంచిపల్లి, మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామాల పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగింది. దీంతో ఆ పరిసర ప్రాంతాలన్నీ గుంతలై దర్శనమిస్తున్నాయి. ఏడాది కిందట టీడీపీ అధిష్టానం పిలుపుమేరకు జమ్మలమడుగులో ప్రస్తుత కడప టీడీపీ పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డికి చెందిన ఇసుక టిప్పర్ ఎదుట పెన్నానదిలో నిరసన వ్యక్తం చేసి నా ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగలేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ రవాణా చేశారని బహిరంగ ఆరోపణలున్నాయి. వైసీపీ పాలనలో అడ్డూ అదుపూ లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నా జమ్మలమడుగు పరిసర ప్రాంతాల అధికారులు ఏ ఒక్కరూ చర్యలు తీసుకోవడానికి సాహసించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నేరుగా పెన్నానదిలోనే టిప్పర్లు చేరి ఎక్స్‌కవేటర్ల ద్వారా ప్రత్యేకంగా ఇసుక దోపిడీలో భాగంగా పెన్నమ్మను గుంతలమయం చేశారు. ఫలితంగా వైసీపీ నేతలు, అనుయాయులకు భారీగా కాసులు కురిపించినట్లుగా తెలుస్తోంది. ఇసుక డబ్బుతోనే వైసీపీలోని కొందరు నేతలు ఆస్తులు సంపాదించినట్లుగా తెలుస్తోంది. జమ్మలమడుగు మండలం గూడెంచెరువు, గండికోట, సున్నపురాళ్లపల్లె, చిటిమిటి చింతల, కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో గ్రావెల్ మట్టి జోరుగా తరలించారు. దీంతో ఆ ప్రాంతాల్లో ఎర్రమట్టి గుంతలు దర్శనమిస్తున్నాయి. గతంలో పెన్నానదిలో ఇసుక పోతే స్థానిక రైతులకు, మంచినీటి బోర్లకు నీటి సమస్య ఏర్పడుతోందని దానవులపాడు గ్రామం అంబవరం గ్రామాల్లో ప్రజలు అధికారులకు తెలియజేసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని విమర్శలు వినపడుతున్నాయి. గతంలో అనేక పర్యాయాలు దానవులపాడు, అంబవరం వాసులు టిప్పర్లను అడ్డుకుని రోడ్లు చెడిపోతున్నాయి, ఇక నుంచి గ్రామం నుంచి ట్రాక్టర్లను తిప్పవద్దని ధర్నా చేపట్టారు. ఒకానొక దశలో ఇసుక అక్రమ రవాణా నుపారెస్టు అధికారులు అడ్డుకుని ఎక్స్‌కవేటర్లను సైతం సీజ్ చేశారు. వీరికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలకడం, తర్వాత అధినేతలు రంగంలోకి దిగడంతో వాటిని వదిలేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో వైసీపీ నేతలు చేసిన అక్రమ ఇసుక రవాణాతో వర్షాభావ పరిస్థితుల వలన ఆయా గ్రామాలకు భూగర్భజలం అడుగంటి పెన్నానదిలో వేసిన బోర్లకు సైతం నీరు ఎక్కడంలేదని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు, సచివాలయాల సిబ్బంది ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం రాత్రి సమయాల్లో ఇప్పటికీ ఇసుక ట్రాక్టర్లు తరలిపోతున్నాయని తెలుస్తోంది. కొందరు అధికారులకు అక్రమ ఇసుక రవాణా జరిగితేనే లాభదాయకంగా ఉంటుందని ప్రజలు సంబంధిత అధికారులపై విమర్శలు చేస్తున్నారు. ఏది ఏమైనా జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లోని పెన్నానదిలో ఇసుక, ఎర్రమట్టి గ్రావెల్ పూర్తిగా ఖాళీ అయింది.



అంబవరం పెన్నానది వద్ద ఇసుక తరలింపుతో ఏర్పడిన గుంతలు



దానవులపాడు పెన్నానది వద్ద ఇసుక కోసం వేచి ఉన్న ట్రాక్టర్లు (ఫైల్‌ఫొటో)



ఇసుక టిప్పర్ ఎదుట నిరసన తెలుపుతున్న భూపేశ్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)



గండికోట దారిలో గ్రావెల్ కోసం తీసిన గుంతలు



గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

బద్వేలులో మూడు సార్లు ఉప ఎన్నికలు



సుబ్బారెడ్డి



విజయమ్మ



సుధారాణి

బద్వేలు టౌన్, ఏప్రిల్ 23: బద్వేలుపేరువింటే ముందుగా గుర్తుకువచ్చేది కాలజ్ఞాన తత్వవేత్త మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వాములవారు. ఆయన బద్వేలు బస్తీ అవుతుందని అప్పట్లోనే వివరించారు. అయితే నేటి సమాజంలో బద్వేలు అంటే మొదట గుర్తుకు వచ్చేది రాజకీయాలు. ఇక్కడి నుంచే రాజకీయాలు శాసించిన వారు ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యారు. 1952లో బద్వేలు నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి 18 సార్లు ఎన్నికలు జరగగా మూడు పర్యాయాలు ఉప ఎన్నికలు జరిగాయి. 1963లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే వడ్డెమాను చిదానందం మృతి చెందారు. దీంతో 1963లోనే మొదటి పర్యాయం ఉప ఎన్నికలు జరిగాయి. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నుంచి నాగిరెడ్డి సుబ్బారెడ్డి ఉప ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి ఎమ్మెల్యే అయ్యారు. తరువాత సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి వరకు తిరుగులేని బావుటా ఎగురవేసి చరిత్రను లిఖించిన బిజివేముల వీరారెడ్డి జిల్లా, రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకున్నారు. బిజివేముల వీరారెడ్డి బద్వేలు వీరారెడ్డిగా రాష్ట్ర స్థాయి పేరొందారు. అప్పట్లో ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా ఆయన చేసిన సేవలు ప్రజల్లో సుస్థిర ముద్రవేశాయి. వీరారెడ్డి 2000 డిసెంబరు 25న మరణించారు. దీంతో 38 ఏళ్ల తర్వాత 2001 ఉపఎన్నికలు జరిగాయి. ఇందులో బిజివేముల వీరారెడ్డి కుమార్తె కొండ్రెడ్డి విజయమ్మ అత్యధిక మెజార్టీతో గెలుపొంది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత క్రమంగా నియోజకవర్గాన్ని ఎస్సీ కేటగిరీకి మార్చారు. 2019లో డాక్టర్ గుంతోటి వెంకట సుబ్బయ్య వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన 2021లో మృతి చెందడంతో 20 ఏళ్ల తర్వాత మూడోపర్యాయం ఉప ఎన్నిక తప్పలేదు. 2021లో వైసీపీ తరపున వెంకట సుబ్బయ్య సతీమణి డాక్టర్ దాసరి సుధారాణి ఉప ఎన్నికల బరిలో నిలబడి గెలుపొందారు. ప్రస్తుతం 2024 లో సుధారాణి మళ్లీ పోటీ చేస్తోంది.

ఎన్నికల మాయ

కారు కూడా రాని చోట కాన్వాయ్‌లు వస్తున్నాయ్

ఐదేళ్లకోసారి ప్రజలు గుర్తుకు వస్తున్నారే....

పోరుమామిళ్ల, ఏప్రిల్ 23: కాడెద్దులు వెళ్లే చోట అప్పుడప్పుడూ కార్లు కనిపించే ప్రాంతానికి సైతం కాన్వాయ్‌లు బయల్దేరుతున్నాయి. ఎప్పుడూ ఊసెత్తని నేతలు పదే పదే పలకరింపులు, ఆప్యాయతలతో హత్తుకుంటున్నారు. ఐదేళ్లకోసారి కనిపించే నేతలు కొత్తగా ఖద్దరు చొక్కాలతో కనిపిస్తున్నారు. లేని పోని బంధుత్వాలు, స్నేహాలు గుర్తుకు వస్తున్నాయి వారికి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోరుమామిళ్ల మండలంలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా నేతలు కాన్వాయ్‌లతో గ్రామస్తులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పలకరిస్తే ఒకటి, పలకరించకపోతే మరొకటి అన్న చందంగా వచ్చిన వారి మాటలు కాదనలేక వద్దనలేక తలూపి ఐదేళ్లకోసారే మేం కనిపిస్తామా అని మనసులోనే తిట్టుకుంటుంటారు. మరికొందరు అయితే గ్రామాల్లో ఈ ఏరియా అంతా నా మాటే వింటారు. మేం చెప్పిందే వేదం, చేసిందే శాసనం, వారంతా మనోళ్లే, నా మాట కాదనరు, మనకే ఎక్కువ ఓట్లుపడతాయి అనే భరోసాగా ఉండండి, బాధ్యతలు మాకు అప్పజెప్పండంటూ కొందరు నేతల వద్ద మెప్పు పొందేందుకు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఉదయం లేస్తే పొలాల్లోకి వెళ్లే రైతులు ఈ కాన్వాయ్‌ల రాకపోకలకు ఆశ్చర్యానికిలోనవుతున్నారు. ఎన్నడూ రాని ఇన్ని వాహనాలు ఇంత మంది జనాలు తమ గ్రామాలకు తమ ఇళ్ల వద్దకు వచ్చి లేని ప్రేమ వలకబోస్తూ దండాలు పెట్టి హామీలు గుప్పిస్తున్నారని ఆశ్చర్యంలో మునిగిపోతున్నారు మరికొందరు. మునుపెన్నడూ తమ సమస్యలు తెలిపితే పరిష్కరించడానికి పలకని వారు ఎన్నికల సమయంలో వరుస కాన్వాయ్‌లతో పగలు, రాత్రుళ్లు తమ ప్రాంతాల్లోకి వచ్చి ప్రచారం చేస్తుంటే విస్తుపోవడం పరిపాటైంది. మరికొందరు ఒకరి తరువాత ఒకరు రాతీ, పగలు గ్యాప్ లేకుండా గుంపులు గుంపులుగా రావడం పరిపాటైంది. కొందరు వారికిమర్యాదలు చేయలేక ఇబ్బందులు పడిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. కొందరైతే ఆ పాటి నాయకులు మా ఇంటివద్దకు వచ్చారు. మాకు పరపతి ఎక్కువగా ఉందని మిగిలిన వారి వద్ద గొప్పలు చెప్పుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. ఎన్నికల రోజు సమీపిస్తుండడంతో ఈ నేతల వాహనాల తాకిడి ఎక్కువైంది. మరి ఈ ఎన్నికల తరువాత ఎన్ని కాన్వాయ్‌లు ఎన్ని కార్లు గ్రామాల్లోకి వస్తాయో అన్న ఆలోచన కూడా వారిలో తలెత్తకపోలేదు. ఈ కాన్వాయ్‌ల కార్ల తాకిడి నేతల పలకరింపులు లేనిపోని ఆప్యాయతలకు మరో 20 రోజులు మాత్రమే గడువు. తరువాత ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో ఉండిపోతారు రాజకీయ పార్టీల నేతలు. ప్రజలకు, రైతులకు మాత్రం వారి పనులు ఎలాగూ తప్పవు. మరికొందరు విచిత్ర వేషాలేస్తూ హత్తుకోవడం, ముద్దు పెట్టుకోవడం, ఏమైపోయావ్, ఏం చేస్తున్నవు, ఏదైనా సమస్య వస్తే నాకు ఫోను చేస్తే క్షణంలో మీ సమస్య తీరుస్తానంటూ ప్రగల్భాలు పలికే వారు కూడా లేకపోలేదు. ఔరా.. ఇదంతా సార్వత్రిక ఎన్నికల మాయా అంటూ జనాలు పెదవి విరుస్తున్నారు.



డైనింగ్ టేబుల్ గదిలో ఏర్పాటైన కార్యాలయ సిబ్బంది టేబుళ్లు, చాంబర్లు

కక్ష కట్టారు... ఆఫీసు పెట్టారు

- అన్నక్యాంటిన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ కార్యాలయం
- నామ రూపాల్లేకుండా పోయిన వైనం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 23: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే విజనర్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రవేశ పెట్టిన అనేక రకాల పథకాలకు జగన్ ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. రోజువారి కూలీలు, కార్మికులు, నిరుపేదలు కడుపునింపే ఉద్దేశంతో ఏర్పాటైన అన్న క్యాంటిన్ భవనాలను కోవిడ్ సమయంలో, మరికొన్నింటిని ప్రభుత్వ ఆఫీసులకు మార్చేశారు. దీంతో అన్న క్యాంటిన్ లక్ష్యం నీరుగారిపోయింది. ప్రస్తుతం నామరూపాల్లేకుండా పోయింది. పులివెందుల పట్టణం గాంధీసర్కిల్ వద్ద అక్టోబరు రెండో తేదీ 2018న గాంధీజయంతిని పురస్కరించుకుని టీడీపీ ప్రభుత్వం రూ.36లక్షలతో ఏర్పాటు చేసిన అన్నక్యాంటిన్‌ను ప్రారంభించారు. మొదట్లో ఇంత తక్కువకు భోజనం అందిస్తారా, అన్నం కూడా అలాగే ఉంటుందని, చాలా రోజులు నిలబడదు మూసేస్తారు అంటూ కొందరు బహిరంగంగా విమర్శించినా చివరకు ప్రజలు కడుపునిండా భోజనం తినడాన్ని చూసిన వారు సైతం ఇదిలాగే కొనసాగాలని ఆశించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన ప్రభుత్వం వస్తే రాజన్న క్యాంటిన్‌లు ఏర్పాటుచేసి మరింత రుచికరమైన భోజనం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీ మరిచి అన్న క్యాంటిన్ లను కూడా ప్రజలు మరిచిపోయేలా చేశారు. దీంతో అన్న క్యాంటిన్ మూతపడిపోయిం ది. పులి వెందులలోని అన్న క్యాంటిన్ ప్రస్తుతం దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సబ్ డివిజన్ అధికారి వారి కార్యాలయంగా మారిపోయింది. అన్న క్యాంటిన్ గతంలో ఉన్న ముఖద్వారం పూర్తిగా మూసేసి వెనుక ఉన్న స్థలంలో కాంపౌండ్ నిర్మించి కార్యాలయ ముఖద్వారం ఏర్పాటు చేశారు.

సంతృప్తిగా తినేవాళ్లం

నేను, నా భార్య వృద్ధాప్యంలో ఉన్నందున భోజనం చేసుకునేందుకు చాలా ఇబ్బందులు పడేవాళ్లం. అన్నక్యాంటిన్‌లో రూ.5కే భోజనం అందిస్తారని తెలిసి సంతోషపడ్డా. నా భార్యకు ఇంటి వద్ద అన్నం వండి పెట్టి, నేను ఉదయం, మధ్యాహ్నం అన్న క్యాంటిన్‌లో తినేవాణ్ణి. వృద్ధాప్యంలో డబ్బు పొదుపు కూడా అయ్యేవి. అన్నక్యాంటిన్ మూత పడడంతో ఎంతో ఆవేదనకు గురయ్యాను. ఇది పట్టణంలోని రామచంద్ర అనే వ్యక్తి చెప్పిన మాటలు. ఇలా ఒకరికి పరిమితమైన మాట కాదు, అనేక మంది నుంచి వ్యక్తమైన ఆవేదన.





అన్న క్యాంటిన్‌లో ఏర్పాటైన విద్యుత్ సబ్ డివిజన్ అధికారి కార్యాలయం - మూత వేసిన ప్రధాన ద్వారం

నాడు నిస్వార్థం.. నేడు స్వార్థం...

నాడు.. నేడు...



చెన్నూరు, ఏప్రిల్ 23: స్వాతంత్రం వచ్చిన తొలినాళ్ల లో ఎన్నికలు నిస్వార్థంగా జరిగేవి. ప్రచారానికి వస్తే ప్రత్యర్థుల ఇండ్ల వద్ద సైతం కూర్చుని మాట్లాడి ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలో స్పష్టంగా మాట్లాడుకునేవారు. ప్రస్తుతం మొత్తం స్వార్థపరమైంది. ఎన్నికల్లో ఇద్దరం పోటీ చేద్దాం ప్రజలు ఎవరికైనా ఓటు వేయని ఈ విషయాన్ని ప్రజలకు చెబుదాం స్వార్థం లేకుండా ఓటు అడుగుదాం ఎవరన్న గెలవని, గెలిచిన వారు ఇప్పుడు ఏమి చెప్పా రో అవి కచ్చితంగా చేయాలని చర్చించుకునేవారు. స్నేహితులు, సమకాలీ కులు చీకటి పడ్డాక రచ్చబండ వద్ద కూర్చుని మాట్లాడుకునేవాళ్లం పోటీ చేసేవాళ్లకు చెప్పేవాళ్లం మాకోర్కెల మీద పోటీ దారులు వాటిని అమలు చేస్తామని అక్కడ చెప్పేవాళ్లు ఆ ప్రకారమే మేము ఓటు వేసేవాళ్లం పైగా నాకు తెలిసి ఇదే చెన్నూరు గ్రామంలో పేదల కోసం ఇంటి స్థలాలు, భూములు ఇచ్చిన వారూ ఉన్నా రు. అప్పుడు వారిది స్వార్థచింతన లేని రాజకీయం అందుకే అలాంటి వారిని ఇప్పుడు మేము తలుచుకుంటున్నాం. ఎంత ఆస్తులు కూడబెట్టుకోవాలి, ఎలా సంపాదించాలి, ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములు కబ్జాచేయాలి ఆ ధోరణితో ఉన్నారు. అలాంటి వారికి ఓటు అనే దెబ్బ తప్పకుండా పడాల్సిందే. అప్పుడు కాని వారికి బుద్ధిరాదు.

పెడబల్లె బాలవీరారెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు

జాప్యం లేకుండా సమస్య తీర్చేవారు....



మా చిన్నతనంలో మా పెద్దలు మేము ఊరి అబివృద్ధి కోసం నాయకుడిని అడిగితే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పలికి సమస్య తీర్చేవారు. నేటి పాలకులు బతిమలాడినా పలికే పరిస్థితి లేదు. ఇప్పటి రాజకీయాలు చూస్తుంటే ఇలాంటి పాలకులా రాష్ట్రాన్ని పాలిస్తుండేదని అనిపిస్తోంది. ఎన్నికల్లో ప్రతి నాయకుడు అది చేస్తం ఇది చేస్తం అంటాడు. ఎన్నికలయ్యాక ఓటు వేసిన వారున్న చోటకి కూడా రావడంలేదు. ఊర్లో వీధులు కసువుతో ఉన్నాయి, చెత్త చెదారం ఉందని చెప్పగానే మరుసటి రోజే వీధుల్లోకి ఎడ్ల బండి రప్పించి కసువు చెత్త బయిటికి తరలించే వారు. ఇప్పుడా లైటు పోయినా దిక్కులేదు, వీధులు గబ్బుగబ్బుగా ఉన్నా పలికే వారు లేరు. ఏం నాయకులో ఏమో అర్థం కావడంలేదు. అందుకేప్రజలు కూడా బాగా ఆలోచించి నేలను ఎన్నుకోవాలి. అప్పట్లో మేం ఒక్కసారి ఓటు వేస్తే నాయకులు ఐదేళ్ల గుర్తు పెట్టుకుని పలుకుతుండేవారు. ఇప్పుడు ఐదునిమిషాల్లో మరిచిపోతున్నారు. మాకు ఎప్పుడు ఓటేశావు, నిన్ను ఎప్పుడూ చూడలేదన్న మాటలు వినిపిస్తున్నాయి.

- నక్కా శింగరయ్య, సీనియర్ సిటిజన్, చెన్నూరు .

తెలుసుకోండి....

ఒక్క ఓటు అని వదిలేస్తే....

అధికారమే తారుమారు ● భవిష్యత్తు నిర్ణయించేది మీరే

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 23: మనం ప్రయాణించాల్సిన బస్సు, రైలో తప్పిపోతే కాస్త ఆలస్యమైనా గమ్యస్థానం చేరుకోవచ్చు. అదే ఓటు వేయకపోతే మళ్లీ ఐదేళ్ల దాకా ఆ అవకాశం కోల్పోయినట్లు. మనది ఒక్క ఓటే కదా అని నిర్లక్ష్యం చేస్తే ఐదేళ్లు నిర్లక్ష్యానికి గురవుతాం. ఒక్క ఓటు తేడాతో ఎన్నో సంచలనాలు చోటు చేసుకున్నాయి ప్రభుత్వాలు కూలిపోయాయి. ఎందరికో అధికారాలు దూరమయ్యాయి. చేతికి అంది వస్తాయన్న అవకాశాలు రాకుండా పోయాయి.

ఇదిగో కొన్ని ఉదాహరణలు

- 1999లో ఒక్క ఓటు తేడాతో వాజ్‌పేయి అధికారం కోల్పోయాడు
- ఒక్క ఓటు తేడాతో ఆంగ్లంపై గెలిచి హిందీ మన దేశ జాతీయ బాషగా గుర్తింపు పొందింది.
- 2008లో రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు సీపీజోషి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయాడు. ఆయన గెలిస్తే ముఖ్యమంత్రి పదవి వరించేది.
- 1576లో అమెరికాలో ఒకే ఒక్క ఓటు తేడాతో జర్మన్‌కు బదులుగా ఇంగ్లీషు అధికార బాష అయింది.
- 1714లో ఒక్క ఓటు తేడాతో చింగ్‌జార్జ్‌వన్ ఇంగ్లాండులో పీటమెక్కాడు.
- 1800లో థామస్ జాఫ్పర్‌సన్, 1824లో జాన్‌స్వీన్ ఆడమ్స్, 1876లో రూథర్‌ఫర్డ్ జేమ్స్‌లు ఎలక్టర్ కాలేజ్‌లో ఒకే ఒక్క ఓటు తేడాతో అమెరికా అధ్యక్షులుగా పదవులు అలంకరించారు.
- 1923 నవంబరు 8న జర్మనీలో నాజీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఒకే ఒక్క ఓటు తేడాతో ఆడాల్‌హిట్లర్ ప్రత్యర్థి ఓడిపోయాడు. లేదంటే ప్రపంచ చరిత్ర మరో విధంగా ఉండేదేమో.
- మీకున్న ఒక్క ఓటుకు అంతటిశక్తి ఉందేమో. నీ ఒక్క ఓటే సంచలనం సృష్టించవచ్చు. అభివృద్ధి చేసేవారికి ఓటు వేయండి మీభవిష్యత్తును మీరే మార్చుకోండి.

అభ్యర్థులు 16 మందికి మించితే...



అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల స్థానం లో ఈవీఎంలు వినియోగిస్తున్నారు. అయితే నియోజకవర్గంలో 16 మంది కం టే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెం డో ఈవీఎం వినియోగించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒక ఈవీఎంలో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకంటే ఎక్కువ మంది బరిలో ఉంటే మరో ఈవీఎం ఉపయోగించాలి. ఉదాహరణకు 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీ ఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు పొందుపరుస్తారు. దీంతో పాటు ఏ పోలింగ్ బూత్‌లో అయినా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలను సీల్ చేసి రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

144 సెక్షన్ ఎందుకు విధిస్తారు



ఎన్నికల సమయంలో అల్లర్లు జరిగే అను మానం ఉన్న సమయంలో, పరీక్షల నిర్వహణ సమయంలో ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తారు. అసలు 144 సెక్షన్ అంటే ఏమిటి, ఎందుకు, ఎప్పుడు విధిస్తారో తెలుసుకుందాం, సీఆర్‌పీసీ 144 సెక్షన్ కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌లకు విస్తృత అధికారాలు కల్పించారు. ప్రధానంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిన సమయంలో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఈ సెక్షన్ అమలు చేస్తారు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల టైంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద దీనిని విధిస్తారు. ఈ సెక్షన్ అమలులోకి వస్తే నలుగురు, ఐదుగురు వ్యక్తులకు మించి గుమికూడకూడదు. కలిసి తిరగడంపై కూడా నిషేధాజ్ఞలు విధిస్తారు. ఎన్నికల సమయంలో నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ సెక్షన్ అమలులో ఉంటుంది. ఆ సమయంలో ప్రదర్శనలు, ఊరేగింపులు, ర్యాలీలు చేపట్టకూడదు. ప్రధానంగా రెండు పార్టీలు గ్రూపుల మధ్య తగాదాలు తలెత్తినప్పుడు కూడా ఇది విధిస్తారు. రెండు నెలల వరకు కలెక్టరు, ప్రభుత్వం నియమించిన మెజిస్ట్రేట్ పోలీస్ మాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్ అమలు చేస్తారు.

విజేత మెజార్టీ కన్నా నోటా ఓట్లే ఎక్కువ



గత ఎన్నిక లను పరిశీలిస్తే విజయం సాధించిన అభ్యర్థి మెజార్టీ కంటే నోటా ఓట్లే ఎక్కువ పోల్ అయిన సందర్భాలున్నాయి. గతంలో రాజస్థాన్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ , మిజోరం తదితర రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడక్కడా విజేత మెజార్టీ కంటే నోటా ఓట్లు ఎక్కువగా పోల్ అవడం చర్చనీయంశమైంది. నాడుబ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగేటప్పుడు చెల్లని ఓట్లు నేడు ఈవీయం పద్ధతిలో నోటా ఓట్లు అభ్యర్థుల తలరాతను మారుస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల్లో సుమారు ఒక శాతం నోటాకు ఓట్లు వేశారు.

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23: ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరం 44వ డివిజన్ నబీకోట్‌లో వేణురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో జనం అధిక సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో సుపరిపాలన అందించనున్న బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కూటమి శ్రేణులను బలపరచాలన్నారు.

34, 35 డివిజన్లలో...

కడప నగరం 34, 35 డివిజన్లలో శివలింగం బీడీ, కన్వెన్షన్ నుంచి టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్సూర్, జావీదు, ఖాసింఖాన్, సయ్యద్ మస్తాన్‌వలి, సా దిక్‌హుసేన్, షేక్ ఇస్మాయిల్, అస్లంబాషా, అఫ్సర్‌ఖాన్, అఫ్సర్, రాఘవ, లింగారెడ్డి, హమిద్‌బుఖారి పాల్గొన్నారు.

నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పిస్తా: బీటెక్ రవి

సింహాద్రిపురం, ఏప్రిల్ 23: పులివెందుల నియోజకవర్గంలో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు నిరుద్యోగులకు, మహిళలకు అండగా నిలబడతానని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తెలికి, జంగంరెడ్డిపల్లి, దేవతాపురం గ్రామాల్లో బీటెక్ రవి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీటెక్ రవి సోదరుడు జయభరత్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ఇంటింటికీ వెళ్లి బాబు చేయబోయే సంక్షేమ పథకాలు గురించి వివరించి ఈ ఎన్నికల్లో సైకిలు గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు సీఎంగా, బీటెక్ రవిని ఎమ్మెల్యేగా, భూపేష్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకుని నియోజకవర్గ అభివృద్ధికి అందరం కృషి చేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరి బాగు కోసం టీడీపీని గెలిపించండి

చెన్నూరు, ఏప్రిల్ 23 :రాష్ట్ర ప్రజలు అందరు బాగుండాలన్నా, ప్రతి ఇల్లు సంతోషంగా జీవించాలన్నా, సంక్షేమ పథకాలు అందుకోవాలన్నా చంద్రబాబు పాలనలోనే సాధ్యమని అందుకే టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ, కోడలు శ్రీచైతన్యరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తా కుమార్తె దివ్యశ్రీ, వి య్యంకురాలు హిమ,మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, జిల్లా బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకులు పి.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలందరికీ మేలు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 23: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని టీడీపీ నాయకురాళ్లు మారెడ్డి చందన, మారెడ్డి సాహితిలు అన్నారు. చెన్నారెడ్డి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మధుసూధన్‌రెడ్డి, సిద్దారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాధవీరెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

వేంపల్లె, ఏప్రిల్ 23: వేంపల్లెలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి సమక్షంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వెలుగోటి అనిల్, సుబ్బయ్య, ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులు పసుపులేటి సుబ్బయ్య, కుందరి కాంక్షయ్య, చాంద్‌బాష, శివయ్య, సాయిశంకర్, వెంకటసుబ్బయ్య కుటుంబాల వారు టీడీపీలో చేరారు.





సింహాద్రిపురం: తెలికి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో బీటెక్ రవి... చెన్నూరు: టీడీపీని గెలిపించాలని కోరుతున్న పుత్తా సరళమ్మ

మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: పుత్తా



పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు

చెన్నూరు, ఏప్రిల్ 23 :రాష్ట్రంలో టీడీపీ, బీజేపీతో పొత్తు పెట్టుకుందని ఆ పార్టీ వల్ల ముస్లిం మైనార్టీలకు నష్టం కలుగుతుందనే ఆందోళన అవసరంలేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. చెన్నూరులో మంగళవారం రాత్రి మైనార్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు ఎన్నో సం క్షేమ పథకాలు అందాయన్నారు.

110 కుటుంబాలు టీడీపీలో చేరిక

చెన్నూరు మైనార్టీ కాలనీ 1వ వార్డులో యువనేత సుభాని, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజాహుసేన్ ఆధ్వర్యంలో 41 మైనార్టీ కుటుంబాలు పుత్తా సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పుత్తా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అలాగే డీఆర్‌డీఏ మాజీ బీసీ వెల్ఫేర్ కమిటీ మెంబరు ఆర్‌ఎంపీ వైద్యుడు పిచ్చయ్య ఆధ్వర్యంలో దాదాపు 35 రజక కుటుంబాలవారు పుత్తా ఆధ్వర్యంలో టీడీపీ కండువా వేసుకున్నారు. అలాగే వైసీపీ నేతలు నీలం గోవిందరెడ్డి ఆధ్వర్యంలో 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమాల్లో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మైనార్టీ నేతలు షబ్బీర్‌హుసేన్, జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్, బీడా బాషా, కోఆప్షన్ మెంబరు గౌస్‌పీర్, నీలం గోవిందరెడ్డి, బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్‌బాబు, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరిగి టీడీపీ గూటికి చేరిన మల్లారెడ్డి

వేముల, ఏప్రిల్ 23: మండలంలోని వి.కొత్తపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పేర్ల గంగులారి మల్లారెడ్డి రెండు రోజుల కిందట వైసీపీ నేత సతీష్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. కాగా కొత్తపల్లె రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డితో చర్చలు జరిపి తిరిగి టీడీపీ గూటికి చేర్చారు. డిష్ శ్రీరామిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమికి 'ఆంధ్ర పెన్షనర్స్' మద్దతు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 23 : ఎన్డీఏ కూట మి, టీడీపీకి ఆంధ్ర పెన్షన ర్స్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు, కా ర్యదర్శి సుభహాన్, కోశాధికారి శంకరయ్య తెలిపారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ పెన్షనర్లు అనేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన డీఏ, బకాయిలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గౌరవ సలహాదారుడు నారాయణ, సంయుక్త కార్యదర్శి వెంకటసుబ్బయ్య, గౌరవ సలహాదారు జయప్రకాశ్, గంగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

జ్వాలాపురం శ్రీకాంత్ మాటలు సిగ్గుచేటు

● టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనరు జనార్ధన్

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 23 : టీడీపీ బ్రాహ్మణ వ్యతిరేకి అంటూ ధర్మవరంలో దేవదాయ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడడం సిగ్గుచేటని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనరు జనార్ధన్ తెలిపారు. టీడీపీని విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. మంగళవారం కడప నగరం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు ఇస్తామని, బ్రాహ్మణులను నిలువునా నమ్మించి జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. టీడీపీ హయాంలో అమలు చేసిన 12 పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులపై దాడులు జరుగుతున్నా ప్రశ్నించలేని దౌర్భాగ్యస్థితిలో ఉన్న జ్వాలా టీడీపీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బ్రాహ్మణులు బుద్ధిచెబుతారన్నారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23 : కడప జిల్లా పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభను ప్రోత్సహిస్తూ 2023-24 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంట ర్, ఐఐటీ, ఇంజనీరింగ్, ఎంసెట్, నీట్ మెడిసిన్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు పద్మశాలీయసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు తెలిపారు. పదో తరగతిలో 500 మార్కులు పైన ఇంటర్‌లో 900 మార్కులు పైన, ఐఐటీ, ఎంసెట్, ఇంజనీరింగ్, నీట్, మెడిసిన్‌లో జిల్లాస్థాయిలో కడప పట్టణ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన పద్మశాలీ విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులు తమ మార్కుల జాబితాతో పాటు టీసీ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఫోన్‌నెంబరు బయోడేటాతో సహా పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 10లోపు పద్మశాలీ కల్యాణ మండపం, చిన్నచౌకు తిరుపతిరోడ్డు, కడప చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 98490 26877కు సంప్రదించాలన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కడప (కల్చరల్), ఏప్రిల్ 23: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయలంలో మంగళవారం పౌర్ణమి రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. సుస్వర వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, అశేష జనుల జయజయ ధ్వనుల మధ్య ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులతో కలిసి 9 పవిత్ర కలశాలను చేతబూని ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి ఆ పవిత్ర కలశాలను అర్చకులకు అందజేశారు. అనంతరం చండీహోమం నిర్వహించారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించండి

ముద్దనూరు ఏప్రిల్23: రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్డీయే కూటమి అభ్యర్థులు బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని గెలిపించాలని ఆదినారాయణరెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి,భూపేష్‌రెడ్డి మేనమామ జయసింహారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం ఉప్పలూరు గ్రామంలోఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పలూరు సర్పంచ్ గంగయ్య, మాజీ ఉపసర్పంచ్ గోపాలక్రిష్ణయ్య, మాదన్నగారిపల్లె మాజీ సర్పంచ్ మాబు, సురేంద్రనాథరెడ్డి, కొలవలి మాజీ సర్పంచ్ తులశయ్య, ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య,టీడీపీ నాయకులు చింతాశివరామిరెడ్డి, పెద్దబాబు,టీడీపీ,బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొండాపురం..: ఎన్డీయే కూటమి అభ్యర్థులు జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిలను గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు.మండలంలోని రేగడిపల్లె, వెంకటాపురం,బ్రహ్మణపల్లె,కోనారుపల్లె,బురుజుపల్లె గ్రామాలలో మంగళవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

నేడు టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి నామినేషన్

(కడప - ఆంధ్రజ్యోతి): కడప అసెంబ్లీ నుంచి టీడీపీ అ భ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్.మాధవీరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ద్వారకనగర్ నుంచి సెవెన్‌రోడ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు.నాయకులు కార్యకర్తలు, భారీ సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

గుడి, మసీదు, చర్చిలో మాధవీరెడ్డి ప్రార్థనలు

కడప (కల్చరల్), ఏప్రిల్ 23: టీడీపీకి కడపలో పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యమని కడప అసెంబ్లీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి ఆమె భర్త టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మాధవీరెడ్డి ఈనెల 24న నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు ప్రజల ఆశీస్సులతో పాటు దేవుని దీవెనలుండాలని ఆకాంక్షిస్తూ మంగళవారం నగరంలో ప్రసిద్ధిగాంచిన విజయదుర్గాదేవి ఆలయం, అమీన్‌పీర్ (పెద్దదర్గా) దర్గా, మరియాపురం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ నేతలు దుర్గాప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, జిలీనీ బాష, పీర్, రబ్బానీ, అఫ్సర్‌ఖాన్, చంద్ర ఓబుల్‌రెడ్డి, రాజశేఖర్, చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్, మాలిన్‌బీ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 23 : స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి పఠాన్ ఖాదర్ బాషా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నామినే షన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌గౌడ్‌కు అందచేశారు. కడప నగరం అభివృద్ధి చెందాలంటే రాజకీయాల్లోకి యువత రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అనుచరులు అన్వర్‌బాషా, మహబూబ్‌బాషా, అన్వర్, అబ్దుల్లా పాల్గొన్నారు.

కేఎస్ఆర్‌ఎంలో ఎస్‌వీఎస్ త్రీడీ రోబోటిక్ ల్యాబ్ ప్రారంభం

సీకేదిన్నె, ఏప్రిల్ 23: కేఎస్ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్‌వీఎస్ త్రీడీ ప్రిటింగ్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోటి వ్యయంతో తమ కళాశాలలో భారతదేశంలో రెండవ సెంటర్ ఆఫ్ ఎక్సలెట్స్ ల్యాబ్‌స్కేల్ రోబోటిక్ త్రీడీ ప్రింటింగ్ ల్యాబ్‌ను ఇండియా దిగ్గజ సంస్థ వయోలా సైంటిఫిక్ నీడ్స్ ప్రైవేటు లిమిటెడ్, జీఎన్‌డీ సెల్యూషన్స్ వారి సహకారంతో రోబోటిక్ ఫ్యూజ్డ్ గ్రాన్‌లేట్‌ఫ్యాబ్రికేషన్ త్రీడీప్రింటింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. దేశంలో వివిధ పరిశ్రమల్లో విస్తృత శ్రేణిలో ప్రాచుర్యం సంతరించుకున్న ఈ ప్రింటింగ్ పరిశోధన, నిర్మాణ రంగ వాహనాల తయారీ, ఏరోస్పేస్, ఆటోమేటివ్ వాహనాల భాగాలు, నమూనాలు, వాహనాలను సృష్టించడం పెద్దస్థాయిలో ప్రయోజనం పొందవచ్చన్నారు. అంతేకాక మెరాయిన్, ఆర్కిటెక్చర్, సింపుల్, శిల్పాలు రూపొందించడానికి వైద్య పరికరాలను ఉత్పత్తి చేయడానికి విప్లవాత్మకమైన మార్పులు కలుగజేయడమేకాకుండా తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తి, నూతన డిజైన్ సౌలభ్యాన్ని పొందుటకు ఇది ఎంతగానో సహాయపడుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌ఛైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, రోబోటిక్ ల్యాబ్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.



కేఎస్ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో రోబోటిక్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న చంద్ర ఓబుళరెడ్డి (నాని)

ఎస్ఎస్‌సీ పరీక్షల్లో గురుకుల్ విద్యాపీఠ్ ప్రభంజనం

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23 :పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఎన్జీఓ కాలనీ గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూలు విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ మునిచంద్ర తెలిపారు. వంద శాతం ఫలితాలను సాధించినట్లు చెప్పా రు. ఎన్.మాధురి 584 మార్కులు, ఎస్.దీపిక 583, ఎస్జీ ఉస్మాన్ 583, కె.దీక్షితరెడ్డి 582, లక్ష్మీనరసింహ 582 మార్కులు సాధించారన్నా రు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం కేవీఆర్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, సీఈఓఏఎల్ వివేకానంద, వైస్‌ప్రిన్సిపాల్ నరసింహ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న గురుకుల విద్యాపీఠ్ యాజమాన్యం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీభాష్యం విజయకేతనం

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 23 : పదో తరగతి పరీక్షల్లో శ్రీభాష్యం పబ్లిక్ స్కూలు ఆకాశమే హద్దుగా విజయకేతనం ఎగురవేసిందని పాఠశాల ప్రిన్సిపాల్ నాగసుబ్బారెడ్డి తెలిపారు. ఆర్.రెడ్డి రోహిత్‌యాదవ్ 594 మార్కులు, ఎన్.పూజితారెడ్డి 590 మార్కులు, వేదశ్రీరెడ్డి 585 మార్కులు, ఎస్.ఫోజియా 579 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. 40మంది విద్యార్థుల్లో 20 మంది 500కు పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. అలాగే కృషి చేసిన అధ్యాపక బృందానికి, విద్యార్థులు తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో భాష్యం యాజమాన్యం

బాలవికాస్ విద్యార్థుల హవా



విశాల్



లోహిత



రిహర్నితారెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 23:పదోతరగతి పరీక్ష ఫలితాల్లో బాలవికాస్ హవా కొనసాగిందని పాఠశాల డైరెక్టరు గంగయ్య, సుబ్బరాయుడు తెలిపారు. ఫలితాల్లో పీబీ విశాల్ 593 మార్కులు, పీబీవీ లోహిత 592, పీరిహర్నితారెడ్డి 589 సాధించి ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లోనిలిచినట్లు తెలిపారు. పరీక్షలకు 155 మంది విద్యార్థులు హాజరు కాగా, 590 మార్కులపైన ఇద్దరు, 580 నుంచి 590 మార్కులు మధ్య పది మంది, 570 నుండి 580మార్కులు మధ్య 21 మంది, 560 నుంచి 570 మధ్యలో 15 మంది, 550 నుంచి 560 మధ్యలో 12 మంది 550 నుండి 593 మార్కుల వరకు సాధించిన విద్యార్థుల సంఖ్య 50 మంది ఉన్నారన్నారు. అలాగే 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 128 మంది ఉన్నట్లు తెలిపారు. అద్భుత ఫలితాలు సాధించినందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, సహకరించిన వారికి యాజమాన్యం ధన్యవాదాలు తెలిపారు.

మరో ముగ్గురు నామినేషన్ దాఖలు

● బీటెక్ రవి ఆస్తులు రూ.51లక్షలు ● కారు లేదు

పులివెందుల, ఏప్రిల్ 23: పులివెందుల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ఆస్తులు రూ.51లక్షలుగా పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవి తరఫున ఆయన సోదరుడు మారెడ్డి జోగిరెడ్డి ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్ పత్రాలను ఆర్ఓ వెంకటేశులుకు సమర్పించారు. అఫిడవిట్‌లో చూపిన ఆస్తులు, అప్పుల వివరాలు...


బీటెక్ రవితో పాటు ఆయన సతీమణి, కుమారుడి చరాస్తులు, స్థిరాస్తులు ఇలా చూపారు. దగ్గర ఉన్న నగదుతో పాటు వివిధ బ్యాంకుల్లోని డిపాజిట్లు, బంగారం కలిపి రూ.11,97,185. కసనూరు గ్రామంలో రూ.40లక్షలు విలువైన 8ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. బ్యాంకు రుణాలు 14లక్షలు ఉన్నాయి. బీటెక్ రవిపై బీటెక్ రవిపై 12 కేసులు నమోదైనట్లు చూపారు. బీటెక్ రవి సతీమణి లతారెడ్డి దగ్గర ఉన్న నగదుతో పాటు వివిధ బ్యాంకుల్లోని డిపాజిట్లు, బంగారు ఆభరణాలు కలిపి రూ.30,98,114. అలాగే రావులకొలను, కసనూ రు గ్రామంలో 17.19ఎకరాల వ్యవసాయ భూములు, 8700స్కైర్‌ఫీట్స్ వ్య వసాయేతర భూములు ఉన్నాయి. వాటి విలువ రూ.82లక్షలుగా తెలిపారు. బ్యాంకు రుణాలు రూ.39లక్షలు ఉన్నాయి. బీటెక్ రవి కుమారుడు రామ్‌రెడ్డి వద్ద ఉన్న నగదుతో పాటు బ్యాంకు డిపాజిట్లు, బంగారు ఆభరణాలు కలిపి రూ.2,61,994గా తెలిపారు. రుణాలు రూ.27.86లక్షలు. పులివెందుల స్థానానికి బీటెక్ రవి తరఫున తమ్ముడు ఒకసెట్ నామినేషన్ దాఖలు చేశారు.



పులివెందులలో బీటెక్ రవి తరఫున నామినేషన్ పత్రాలను ఆర్ఓ వెంకటేశులుకు అందిస్తున్న ఆయన సోదరుడు జోగిరెడ్డి

ఐదో రోజు రెండు నామినేషన్లు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 23 :నామినేషన్ ప్రక్రియలో భాగంగా రెండు సెట్లు నామినేషన్లు దాఖలు అయ్యాయి.మంగళవారం ఉదయం 11గంటల పైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఒక సెట్టు నా మినేషన్ ఆర్వో గణేశ్‌కుమార్‌కు తన కుటుంబ సభ్యులతో కలిసి అందించారు. కమలాపురం అ సెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పుత్తా చైతన్యరెడ్డి ఒక సెట్టునామినేషన్ పత్రాలను కుటుంబసభ్యులతో కలిసి కమలాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గణేష్‌కుమార్‌కు సమర్పించారు. నామినేషన్‌లో పుత్తా నరసింహారెడ్డి ఎన్నికల అఫిడవిట్ సమర్పించారు.



జగన్‌ది విధ్వంసకర ప్రభుత్వం

టిడ్కో ఇళ్ళు కూలదోస్తున్నారు ● రాచమల్లు ప్రజా ద్రోహి : ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి ● విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు ● పలుచోట్ల భారీగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 23 : ప్రొద్దుటూరులో మంగళవారం 32 వవార్డులో మాజీ కౌన్సిలర్ బద్వేలు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీనుంచి టీడీపీలోకి చేరారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నుంచి చేరిన వారిలో మార్కాపురం నాగలక్ష్మీ, మార్కాపురం శ్రీను, సుజిత్, అమ్మణ్ణి, మార్కెట్ బాషా, జయమ్మ, నిజాం తదితరులు చేరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిల్లర్ తలారి పుల్లయ్య వద్దిబాలుడు పాల్గొన్నారు.

కానపల్లెలో సర్పంచ్ శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో..: కొత్తపల్లె పంచాయతీ లోని కానపల్లెలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీనుంచి టీడీపీలోకి 50 కుటుంబాలు చేరాయి.వీరందరికీ వరదరాజులరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ముఖ్యులు జమాల్‌బాషా, అబ్దుల్ ఖాదర్, షబ్బీర్, మహబూబ్ బాషా, షరీఫ్, పఠాన్ బాషా, మహ్మద్ సద్దాం వున్నారు.

టంగుటూరులో టీడీపీలోకి భారీ చేరికలు

రాజుపాలెం, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని టంగుటూరులో మంగళవారం ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో ఓసీ సామాజిక వర్గానికి చెందిన దాదాపు 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. ముందుగా వరదరాజులరెడ్డికి పూలమాలలు వేసి బాణ సంచా పేలుస్తూ గ్రామంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం కండువా వేసి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ చేరిన ప్రతి కార్యకర్తకు తమవంతు సాయంగా అ ండగా ఉంటామన్నారు. అదే విధంగా ఐదేళ్లుగా అరాచక పాలన సాగుతోందని, ఈ పాలనకు స్వస్తి పలకాలంటే యువత అందరూ నడుం బిగించి సైకిలు గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు ప్రభుత్వం వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.పార్టీలో చేరిన వారిలో ధనిరెడ్డి వెంకటరెడ్డి, గోనా పెద్దిరెడ్డి, కాకర్ల సంజీవరెడ్డి, శివశంకరరెడ్డి, ముక్కమల జయరామిరెడ్డి (జయన్న), కాసా సుంకిరెడ్డి, ముక్కర్ల చంద్రారెడ్డి, ఉప్పలూరు సురేశ్‌రెడ్డి, పాణ్యం సుబ్బారెడ్డి, సర్పంచ్ బండి అహరున్, కాసర్ల చిన్నపోలిరెడ్డి, పెద్దపోలిరెడ్డి, ధనిరెడ్డి శివలింగారెడ్డి, కాసా రామిరెడ్డి, పోతి నేని రాముడు, వంకాయల శ్రీనివాసులు, జనసేన నాయకుడు చంద్రగిరి సుబ్బరాయుడు, మైదుకూరు సుబ్బారావు, ముండ్లపల్లె రమేశ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, మానుకింది ఖాదర్‌బాషా, మాజీ జడ్పీటీసీ గుత్తి మంజులు, కొరపాటి రామచంద్రారెడ్డి, జయవీర ప్రతాప్‌రెడ్డి, కొట్టాల జగన్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి వివిధ గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాచమల్లు ప్రజా ద్రోహి : వరద



ప్రొద్దుటూరు,ఏప్రిల్ 23 : జగన్‌ది విధ్వంసకర ప్రభుత్వ మని అందుకే ప్రొద్దుటూరు లో 30 కోట్ల రూపాయలతో నిర్మించిన టిడ్కో ఇళ్ళను కూల్చివేసి ఆ స్థలాలను అనుడాకు అప్పగించి సెంటు ఐదు లక్షల వంతున అమ్ముకుని ప్రభుత్వం సొమ్ము చేసుకుంటుందని ఈ పనులకు దగ్గరుండి భూమిపూజ చేయించిన రాచమల్లు ప్రజాద్రోహి అని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విమర్శించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు టిడ్కో ఇళ్ళను వ్యతిరేకించి వాటిని తీసుకోవద్దని ఇంటింటికి ప్రచారంచేసి తాను అధికారంలోకి వస్తే రెండు సెంట్ల స్థలంలో ఒక్క రూపాయి తీసుకోకుండా ఇళ్లు కట్టించి ఒకచేత్తో పట్టా మరో చేత్తో ఇంటి తాళాలు ఇస్తానని అలా ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో తన ముఖం చూపనన్న రాచమల్లు ఎలా ఓట్లు అడుగుతున్నాడన్నారు. రెండు సెంట్లు ఇవ్వకుండా సెంటు మాత్రమే ఇచ్చి మోసం చేశాడన్నారు. లబ్ధిదారుల నుంచి 35 వేల వంతున 84 కోట్లు వసూలు చేసి దోచుకున్నారు తప్ప ఎక్కడా ఒక్క ఇంటిని పూర్తి చేయలేదన్నారు. నిన్నటి ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆదాయం ఆస్తులు తప్పుగా చూపెట్టాడన్నారు. తానే స్వయంగా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్ళి రూ. 150 కోట్లు ఇచ్చి తన ఆస్తులు ఎవ్వరైనా తీసుకోవచ్చని బహిరంగంగా చెప్పి అఫిడవిట్లో అధికారులను తప్పుదోవ పట్టించాడన్నారు. వచ్చేఎన్నికల్లో కచ్చితంగా రాచమల్లుకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ ప్రభుత్వం తెచ్చుకుందాం

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 34 : సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ ప్రభుత్వం తెచ్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 41 వవార్డు లోని కుమ్మర కొట్టాల, నాగుల కట్టవీధి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోగా బాలవీరయ్య, గంజికుంట ఆంజనేయులు , బోగా చిన్నవీరయ్య, నాగార్జున రంగారెడ్డి శ్రీనివాసులరెడ్డి, కొంగతి సుబ్బరాయుడు, నాగయయ మురళీ, సోమా బాలయ్య చౌడం వెంకటకొండయ్య, వద్ది బాలుడు, లాయర్ శ్రీను, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టాలి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 23 : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను తరిమి కొట్టాలని మాజీ ఎమ్మెల్సీ వరదరాజులరెడ్డి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి లు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపల్లె పంచాయతీ కానపల్లెలో కూటమి అభ్యర్థులైన వరదరాజులరెడ్డి, భూపేష్‌రెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు అసెంబ్లీ పరిశీలకుడు డా. ఏవీఆర్ ప్రసాద్ , మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి టీడీపీ నాయకుడు బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, బాలిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కానపల్లెరాజారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య , ఆసం రఘురామిరెడ్డి,నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు

మహిళల కు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 23 : టీడీపీ ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణ, కోడలు మీనా భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి తెలిపారు. మంగళవారం 27 వవార్డు లోని వసంత పేట రామేశ్వరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గా వరదరాజులరెడ్డిని, ఎంపీగాభూపేశ్‌రెడ్డిని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిల్లర్ తలారి పుల్లయ్య, తలారి రమేష్, సునీల్ స్వరాజ్ శివారెడ్డి, ప్రసన్న శ్రీనివాసులరెడి చీమల రాజశేఖర్‌రెడ్డి బోగాల లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.



రాజుపాలెం మండలం టంగుటూరులో వరద సమక్షంలో భారీ చేరికలు



వరద సమక్షంలో కానపల్లెలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

రాచమల్లు అరాచక పాలనకు ముగింపు పలకండి

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 23 : ప్రొద్దుటూరులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అరాచకపాలనకు ముగింపు పలకాలని మాజీ ఎమ్మెల్యే సోదరులు హనుమంతరెడ్డి, భార్గవరెడ్డి, యువనాయకుడు బచ్చల ప్రతాప్ కోరారు.మంగళవారం 13 వవార్డు శ్రీరాముల పేట వీధిలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు పాలనలో ప్రొద్దుటూరులో అభివృద్ధి సాధించకపోగా నేరాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో ఆవుల రాజేశ్వరరెడ్డి వెంకటస్వామి, వీరభద్రుడు, రామాపురం గురివిరెడ్డి, ఉండేల గురివిరెడ్డి దస్తగిరి, శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.









కొత్తపల్లెపంచాయతీలోని కానపల్లె ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, 27 వార్డు ప్ర.చారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి, భూపేష్‌రెడ్డి కుటుంబసభ్యులు, 13 వవార్డు ప్రచారంలో పాల్గొన్న వరదసోదరులు హనుమంతరెడ్డి, భార్గవరెడ్డి, బచ్చల ప్రతాప్, 32 వవార్డులో వరద సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

పదోతరగతి టాపర్లను అభినందించిన

వెంగమాంబ హైస్కూలు యాజమాన్యం



విద్యార్థులను అభినందిస్తున్న వెంగమాంబ హై స్కూలు యాజమాన్యం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 23 : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 595, 594, 586, 584, 584, 583, 582, 582, 580 టాప్ ర్యాంకులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వెంగమాంబ హైస్కూలు ఛైర్మన్ గుర్రం పుల్లప్పనాయుడు అభినందనలు తెలిపారు. పరీక్షల్లో 82 మంది విద్యార్థులుహాజరు కాగా, అందులో 29 మందికి 550కి పైగా మార్కులు, 51 మందికి 500కు పైగా మార్కులు సాధించారని ఆయన తెలిపారు. టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు క్రిష్ణవేణి, మానస తదితర విద్యార్థులకు అభినందనలు తెలిపారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన క్రిష్ణవేణి, మాసనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మినిస్ట్రేటర్ నాగలింగేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి : ఆది, భూపేశ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 23: నియోజకవర్గంలోని ఎన్డీయే కూటమిలో ఉన్న ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్టవీధిలో ఎన్డీయే కూటమిలోకి 30 కుటుంబాలవారు చేరారు.ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్.ఉప్పలపాడులో ఎన్డీయేలోకి 20 కుటుంబాలు చేరిక..: జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం 20 కుటుంబాలవారు ఎన్డీయే కూటమిలోకి చేరారు. వారికి కడప టీడీపీ పార్లమెంటు అభ్యర్థి భూపేశ్ రెడ్డి, జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి వారిని ఆహ్వానించి కండువాలు వేసి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన సీనియర్ నేత పేటా ఓబుళరెడ్డి, వీరారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మునిరెడ్డి, శ్యాంసన్, రామసుబ్బారెడ్డి, రామమోహన్, మస్తాన్‌రెడ్డి, మోహన్‌రెడ్డిలతోపాటు మరికొందరు చేరారు. ఈ కార్యక్రమంలో చదిపిరాళ్ల డాక్టర్ రాజేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, దేవగుడి యూత్ బృందం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 100 కుటుంబాలు చేరిక

మైలవరం, ఏప్రిల్ 23: మండలంలో భారీ ఎత్తున వైసీపీ నుంచి బీజేపీ, టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. మంగళవారం మైలవరంలోని అయ్యవారిపల్లికి చెందిన చౌడం శేఖర్, చౌడం శివారెడ్డి, చౌడం బాలక్రిష్ణ ఆధ్వర్యంలో 100 కుటుంబాల వారు ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, టీడీపీ సీనియర్ నేత మల్లేల గురివిరెడ్డి, మైలవరం చంద్ర ఓబుళరెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి

ఇంటింటి ప్రచారంలో పుట్టా



మైదుకూరు, ఏప్రిల్ 23 : టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్ నామినేషన్ వేసిన అనంతరం ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. మంగళవారం పట్టణంలోని 6వ వార్డులో నాయకులతో కలసి ఆయన టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. సైకిల్ గుర్తుకే ఓట్లు వేయాలని, కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు.

టీడీపీలోకి వైసీపీ నాయకుడు..: మున్సిపల్ పరిధిలోని లింగాలదిన్నెకు చెందిన వైసీపీ నాయకుడు వంకాయల పెద్ద సుబ్బన్నను టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

చాపాడు..: ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. తప్పెట ఓబాయపల్లె, రేపల్లె, బసిరెడ్డి పల్లె గ్రామాల్లో మంగళవారం సుధాకర్‌యాదవ్ బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మహానందీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోశన్న గెలుపు కోసం ప్రచారం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 23 : కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం వినాయకనగర్, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గోపవరం, ఏప్రిల్ 23 : నగరంలో బుధవారం 33కేవీ పాయలకుంట్ల ఫీడరులో ట్రీ కటింగ్ సందర్భంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఇంజనీరు కుళాయప్ప, ఏఈ చిన్నయ్య తెలిపారు. శ్రీనివాసపురం, గానుగపెంట, పీపీకుంట సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 6గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.


పుట్టాను ఆదరించండి

ఖాజీపేట, ఏప్రిల్ 23:పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఆదరించాలని జిల్లా తెలుగుయువత కార్యదర్శి రామనాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పత్తూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరు తెలుగుదేశం సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిచ్చినాయుడు, పుల్లయ్యనాయుడు, మండల తెలుగుయువత ప్రెసిడెంట్ సందీప్‌నాయుడు, పుల్లయ్యనాయుడు, ఉపసర్పంచ్ రమణ, బ్రహ్మనాయుడు, జానకీరాం, రమేష్‌నాయుడు, రామసుబ్బయ్య, సుబ్బరాయుడు, రంగనాయకులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆది, భూపేశ్ సమక్షంలో చేరికలు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 23: ఎర్రగుంట్ల నగరపంచాయతీకి చెందిన మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్లు, మాజీ ఎంపీటీసీలు మంగళవారం రాత్రి ఎన్డీయే కూటమిలో చేరారు. ఎర్రగుంట్ల నడివూరుకు చెందిన మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్, మాజీ ఎంపీటీసీ సన్నపురెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపీటీసీ సన్నపురెడ్డి బాలనారాయణరెడ్డి వైసీపీని వీడి బీజేపీలో చేరారు. ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

●మాజీ మార్కెట్ వైస్‌ఛైర్మన్ మల్లుగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి మాజీ ఎంపీటీసీ సావిత్రి కూడా మంగళవారం రాత్రి ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సి.ఆదినారాయణరెడ్డి, సి.భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. అలాగే వేంపల్లి రోడ్డు రోడ్డులో నివాసం ఉంటున్న గంగాధర్‌రెడ్డి తన అనుచరులతో బీజేపీలో చేరారు. చేరారు. మరి కొందరు ఎర్రగుంట్లలో ఆది. భూపేశ్‌రెడ్డి సమక్షంలో ఎన్డీయేలో చేరారు.





ఎనిమిది నామినేషన్లు దాఖలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 23: జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ల ప్రక్రియకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గానికి ఎనిమిది నామినేషన్లు వేశారు. వెంగల జగదీశ్వర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తర్వాత బుచ్చుపల్లె పుల్లారెడ్డి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరుపున నామినేషన్ వేశారు. సింగం సుధాకర్‌రెడ్డి ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి పార్టీ తరుపున , బీఎస్పీ తరుపున బుడిచనపల్లి ఓబయ్య నామినేషన్ వేశారు. అల్లె ప్రభావతి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. చదిపిరాళ్ల వీరరఘువర్ధన్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. చామకూరి విష్ణువర్ధన్‌రెడ్డి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరుపున, ఉలువల భరత్‌కుమార్‌రెడ్డి రాష్ట్రీయ జనతాదళ్ తరుపున నామినేషన్లు వేశారు.

బద్వేలులో ఆరు ...

బద్వేలు, ఏప్రిల్ 23: నామినేషన్ ప్రక్రియలో భాగంగా మంగళవారం ఆరు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా వైసీపీ అభ్యర్థి డాక్టర్ దాసరి సుధ 2వ సెట్ నామినేషన్ దాఖలు చేయగా, వైసీపీ తరపున హరిప్రసాద్, ఇండియా కూటమి తరపున వంకెల శ్రీనివాసులు, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి పార్టీ తరపున నాగదాసరి ఓబులేసు, జనసహాయక శక్తి పార్టీ తరపున గంగాధర్, ఇండియా కూటమి తరపున మాజీ ఎమ్మెల్యే ,తిరువీధి జయరాములు నామినేషన్ దాఖలు చేశారు.

నేడు బొజ్జా రోశన్న నామినేషన్

బద్వేలు, ఏప్రిల్ 23: టీడీపీ ,జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి బద్వేలు ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్న నామినేషన్ వేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనాయకుడు రితేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు స్థానిక మార్కెట్‌యార్డు నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని టీడీపీ , జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.